ప్రచురణార్హమైన

**భారత దేశ సర్వోన్నత న్యాయస్థానము**

**క్రిమినల్ అప్పీల్లేట్ అధికార పరిధి**

**క్రిమినల్ అప్పీల్ నెం. 609/2015**

**ఇంద్రజీత్ దాస్ .. అప్పీలుదారు**

**వర్సెస్**

**త్రిపుర రాష్ట్రము .. ప్రతివాది**

# తీర్పు

**విక్రమ్ నాథ్, న్యాయమూర్తి.**

1. అప్పీలుదారుని అప్పీలును తేదీ 09.10.2013 నాడు త్రిపుర ఉన్నత న్యాయస్థానము వారు కొట్టివేస్తూ, ఐపిసి లోని సెక్షన్ లు 302, 34 తో కలిపి, మరియు 201 క్రింద ట్రయల్ కోర్టు వారు విధించిన శిక్షను ఖరారు చేసి, అప్పీలుదారుకు జీవిత కాల ఖైదును, మరియు విధించిన మిగితా శిక్షలు ఏకకాలములో అమలు జరగాలని తీర్పునిచ్చిరి. అట్టి తీర్పును సరిదిద్దాలని అప్పీలుదారు ఈ అప్పీలును దాఖలు చేసెను.

2. శాంతిపూర్ వద్ద గల కైలా షహర్ – కుమార్ ఘాట్ రోడ్డుపై చాలా ఎక్కువ పరిమాణములో రక్తము కనబడినదని ఒక మంతు దాస్ (పిడబ్ల్యూ-40), కైలా షహర్ పోలీస్ స్టేషన్ కు టెలిఫోన్ సమాచారమందించినారనే విషయముతో ప్రాసిక్యూషన్ కథనము మొదలైనది. అట్టి టెలిఫోన్ సమాచారమును బిందు భూషణ్ దాస్ (పిడబ్ల్యూ-1) అందుకొని జి, డి రిజిష్టర్ లో విషయాన్ని నమోదు చేసి, వెంటనే సబ్ ఇన్స్పెక్టర్ కాజల్ రుద్రపాల్ తో కలిసి అట్టి ప్రదేశమునకు వెళ్ళెను.

3. ఆ ప్రదేశములో రోడ్డుపై రక్తము మాత్రమే కాదు గానీ, రక్తమంటిన వోజాలీ (పెద్ద కత్తి), ఒక టాగా (తాడు) మరియు మోటార్ సైకిల్ యొక్క రేర్ – వ్యూ మిర్రర్ కు సంబంధించిన విరిగిన గాజు ముక్కలు కూడా పి. డబ్ల్యూ–1 గమనించెను. ఈ వస్తువులన్నీ స్వాధీన పర్చుకొని, సీల్ చేసి, స్వాధీన మెమో తయారు చేసిరి. తదుపరి పరిశోధనలో రోడ్డు ప్రక్క గల అడవిలోనికి ఏదో బరువైన వస్తువును లాక్కొని వెళ్ళినట్లుగా గుర్తులు కనుగొనిరి. ఈ గుర్తులు మాను నది వరకు సాగినవి. తరువాత మాయమైనవి.

4. పరిశోధన ఇంకనూ జరుగుచుండగా అర్జున్ దాస్ (పి డబ్ల్యూ–7) తన మేనల్లుడు కౌశిక్ సర్కార్ ముందు రోజు సాయంత్రము అనగా, తేదీ 19.06.2007 నుండి కనిపించుట లేదని పోలీస్ స్టేషన్ కు సమాచారమిచ్చెను. అట్టి సమాచారము ప్రకారము కౌశిక్ సర్కార్ ముందు రోజు సాయంత్రము తన బైక్ పై బయటికి వెళ్ళి తిరిగి రాలేదు. దర్యాప్తు అధికారి మోహన్ పూర్ గ్రామములోని కౌశిక్ సర్కార్ ఇంటికి వెళ్ళి అతని తల్లి (పిడబ్ల్యూ–25) యొక్క వాంగ్మూలమును రికార్డ్ చేసెను. కౌశిక్ సర్కార్ ఇద్దరు స్నేహితులు ఇంద్రజీత్ దాస్ (అప్పీలుదారు) మరియు ఒక 'జువెనైల్ కె' తో కలిసి బయటికి వెళ్ళిరని అతని తల్లి తెలిపెను. వారిరువురినీ పోలీస్ స్టేషన్ కు రమ్మనగా, వారు రాలేదు. తదుపరి దర్యాప్తు అధికారి అప్పీలుదారుని ఇంటికి వెళ్ళెను.

5. దర్యాప్తు అధికారి చెప్పిన ప్రకారము, ఇరువురు ముద్దాయిలు ఫాటిక్రాయ్ మరియు కంచన్ బరీ ప్రాంతమునకు చనిపోయిన కౌశిక్ సర్కార్ బైక్ పై వెళ్ళిరని దర్యాప్తు అధికారి ఎదుట ఒప్పుకొనిరి. దారిలో వారు మద్యము సీసాను కొనుక్కొని, బాబుల్ దాస్ తో కలిపి, దానిని సేవించిరి. అనంతరము, వారు కైలా షహర్ వైపు బండిపై వెళ్ళసాగిరి. శాంతిపూర్ వద్ద కాలకృత్యము కొరకు బండి దిగిరి. కౌశిక్ మోటార్ సైకిల్ పై కూర్చొనియుండెను. ఆ

స్థితిలో, ముద్దాయిలిద్దరూ కౌశిక్ సర్కార్ పై వోజాలీలతో దాడి చేసిరి. వారు హెల్మెట్, పర్స్ మరియు రెండు వోజాలీలను దగ్గరలో గల అడవిలో విసిరివేసి, మృతదేహమును మరియు మోటార్ సైకిల్ ను దగ్గరలో గల నది వద్దకు లాక్కొని వెళ్ళి, నదిలోనికి విసరివేసిరి. తరువాత వారు నదిలో ఈదుకుంటూ అప్పీలుదారు ఇంటికి వెళ్ళి, వారి రక్తపు మరకలు గల బట్టలను కాల్చివేసిరి.

6. నిందితుడు 'బాల నేరస్తుడు కె' ను జువెనైల్ జస్టిస్ (కేర్ ఎండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) చట్టము, 2000 లోని నిబంధనల ప్రకారము విచారించిరి. ప్రస్తుత అప్పీలుదారును రెగ్యులర్ సెషన్స్ కోర్టు విచారించెను. నేరారోపణ విధించి, చదివి వినిపించగా, అతడు నేరము చేయలేదనియు, తనను విచారించవలసినదిగా కోరెను.

7. ఎక్కువలో ఎక్కువగా 40 మంది సాక్షులను ప్రాసిక్యూషన్ వారు విచారించిరి. మరియు డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ను పరిశీలించి, అట్టి దానిని నిరూపించి, ఎగ్జిబిట్స్ గా చూపించిరి. తేదీ 19.04.2011 నాటి తీర్పు దృష్ట్యా, ప్రాసిక్యూషన్ వారు అప్పీలు దారుని నేరమును హేతుబద్ధమైన అనుమానానికి అతీతంగా నిరూపించిరనియు, కావున ఆ విధముగానే ముందుగా రికార్డు చేసినట్లుగా అట్టి నేరములకు శిక్ష విధించెనని ట్రయల్ కోర్టు వారు తీర్మానమును రికార్డు చేసిరి.

8. అప్పీలుదారు ఉన్నత న్యాయస్థానములో అప్పీలు దాఖలు చేయగా, ఉన్నత న్యాయస్థానము కూడా ప్రాసిక్యూషన్ వారు నేరారోపణను హేతుబద్ధమైన అనుమానానికి అతీతంగా నిరూపించుటలో విజయము పొందిరనే అభిప్రాయముతో ఆక్షే పిత తీర్పు ద్వారా అప్పీలుదారుని అప్పీలును కొట్టివేసిరి.

9. కక్షిదారుల తరపు న్యాయవాదుల వాదనలను మేము విన్నాము. మరియు రికార్డులోని భౌతిక సాక్ష్యాధారాలను పరిశీలించితిమి.

10. ప్రస్తుత కేసు పరిస్థితులపై ఆధారపడిన ఎవిడెన్స్, ఎందుకంటే నేరము జరిగినపుడు ఎవరూ చూడలేదు. పరిస్థితుల ఆధా రంగా ఎవిడెన్స్ చక్కగా స్థిరపర్చబడినది. ముఖ్యమైన **శరద్ బిర్ధిచంద్ సర్దా వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర( 1984 (4) SCC 116)** కేసులో పరిస్థితులు ఖచ్చితమైన విధానముతో పొరపాటు లేకుండా నిందితుని నేరమును ఎత్తి చూపగలగాలి. కూడగట్టిన పరిస్థితులన్నీ ఒక పూర్తి గొలుసుగా ఏర్పడి, మనిషిగా అన్ని విధాలా తన వీలునుపయోగించి నిందితుడు నేరము చేసెనని నమ్మదగినదిగా ఉన్నదనియూ, మరియు నేరము చేసెనని తప్ప ఊహాజనిత వివరణ ఇచ్చుటకు వీలు లేకుండా ఉన్నదనియూ, నిందితుడి అమాయకతకు అనుగుణముగా లేదనియూ, కావున అట్టి తీర్మా నము నుండి తప్పించుకోలేడని సారాంశము. **శరద్ బిర్ధిచంద్ సర్దా** ( పైన పేర్కొన్న ) కేసులో పొందు పర్చినట్టి సూత్రమును ఈ కేసులో వర్తింపచేసిరి. **శైలేంద్ర రాజ్ దేవ్ పాశ్వాన్ మరియు ఇతరులు వర్సెస్ స్టేట్ ఆఫ్ గుజరాత్ తదితరులు( AIR 2020 SC 180)** కేసులో ఈ కోర్టు ఈ విధముగా పరిగణించినది. పరిస్థితులకనుగుణమైన ఎవిడెన్స్ లో, చట్టము రెండు అవసరతల గూర్చి తెలుపును. మొదటిగా, పరిస్థితుల గొలుసులో కూర్చబడిన ప్రతీ లింకు నిందితుని నేరమును నిరూపించగలగాలి. ప్రాసిక్యూషన్ వారు నిందితుని నేరమును హేతుబద్ధమైన అనుమానానికి అతీతంగా నిరూపించగలగాలి. రెండవదిగా, పరిస్థితులన్నీ నిందితుని నేరము వైపు మాత్రమే సమర్ధవంతముగా ఎత్తిచూపగలగాలి. ఈ కోర్టు వారు మాటి మాటికీ పైన తెలిపిన సూత్రములన్నియూ అనుగుణముగా పాటించుచున్నందున ఇతర తీర్పులను సూచించుట ద్వారా ఈ తీర్పునకు మేము భారము కలిగించము.

11. పైన తెలిపిన స్థిరపర్చబడిన చట్టపరమైన ప్రతిపాదనల నేపథ్యంలో, ప్రస్తుత కేసులోని వాస్తవములు, పరిస్థితులు మరియు ఎవిడెన్స్ గూర్చి పరిశీలించుటకు మేము ముందుకు సాగి, ప్రాసిక్యూషన్ వా రు గొలుసులోని ప్రతీ ఒక్క లింక్ పూర్తిగా స్థిరపరచగలిగిరా లేదా అను విషయము కనుగొనెదము.

12. పరిస్థితులకు గొలుసులోని ప్రాథమిక లింకులు ఉద్దేశముతో మొదలై, చివరిసారి చూచిన థియరీ, స్వాధీనము, మెడికల్ ఎవిడెన్స్, ఏవైనా నిపుణుని అభిప్రాయములుంటే అట్టివి, మరియు పరిస్థితుల గొలుసులోని ఏ ఇతర అదనపు లింక్ వరకు సాగును.

13. మొట్టమొదటిగా, ఎందువలన అప్పీలుదారుడు, తన తోటి నిందితుడు 'జువెనైల్ కె' తో కలిసి నేరము చేయుటకు ప్రాసిక్యూషన్ ఎలాంటి ఉద్దేశమును చూపుటకు ముందుకు రాలేదని మేము రికార్డు చేయవచ్చును. ట్రయల్ కోర్టు కానీ, ఉన్నత న్యాయస్థానము గానీ, ఎలాంటి ఎవిడెన్స్ లేనందున నేరము చేయుటకు గల ఉద్దేశము గూర్చి రికార్డు చేయలేకపోయెను.

14. ఉద్దేశము యొక్క ఆకృతి గూర్చి ఒకే ఒక్క పేరా నెం. 20 ను ఉన్నత న్యాయస్థానము పరిశీలించినది. అట్టి పఠనము, ఏదైనా ఉద్దేశమును గమనించినట్లుగా ప్రతిఫలించలేదు. కానీ, 'జువెనైల్ కె' నేరము వెనుక గల కీలకమైన వ్యక్తి అనియూ, దాడి చేయుటకు కత్తిని అతడే కొనుగోలు చేసెనని గమనించెను. ఇది ఏ విధంగానూ ఉద్దేశమును వెల్లడి చేయలేదు.

**15.** పరిస్థితులకనుగుణమైన ఎవిడెన్స్ లో, ఉద్దేశము ప్రముఖ పాత్రను పోషించును. ప్రత్యక్ష ఎవిడెన్స్ లో కూడా ఉద్దేశము ఒక పాత్రను పోషించవచ్చును. కానీ, పరిస్థితులకనువైన ఎవిడెన్స్ లో ఎక్కువ ప్రాముఖ్యతను కలిగివుండును. ఇది పరిస్థితుల

గోలుసులో ఒక ముఖ్యమైన లింక్. పరిస్థితులకనువైన ఎవిడెన్స్ కేసులో ఉద్దేశము యొక్క ప్రాముఖ్యతను క్రింద సూచించబడిన రెండు తీర్పులు తెలియజేయును.

1. కూన ఎలియాస్ సంజయ బేహరా వర్సెస్ స్టేట్ ఆఫ్ ఒడిషా ( (2018) 1 SCC 296); మరియు

2. రంగనాయకి వర్సెస్ స్టేట్ బై ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ((2004) 12 SCC 521).

16. మరియు, ప్రస్తుత కేసులో మృత దేహమును స్వాధీన పర్చుకోలేదు, ఒక్క అవయవము మాత్రమే స్వాధీన పర్చుకొనిరి. కానీ , ఆ అవయవము మృతుడు కౌశిక్ సర్కార్ దే అని నిరూపించుటకు డిఎన్ఎ పరీక్ష చెయలేదు. కాబట్టి ప్రాసిక్యూషన్ వారి కేసు మొత్తము కౌశిక్ సర్కార్ మృతి చెందినాడని తలంచి ముందుకు సాగెను. కార్పస్ డెలిక్టి సూత్రములో ఇరు వైపుల తీర్పులు గలవు. మొదటిగా , మృతదేహమును స్వాధీనపర్చుకొనకపోయినా , చనిపోయినట్లుగా నిర్ధారణను రికార్డు చేయవచ్చును. వేరే అభిప్రాయము ప్రకారము మృతదేహమును స్వాధీనపర్చుకొనకుండా చనిపోయినట్లుగా నిర్ధారణను రికార్డు చేయకూడదు. ఒకవేళ మృతుడనుకొన్నవాడు తరువాత బ్రతికివస్తే అట్టి నేరము గూర్చి వేరెవరో శిక్షింపబడి జైలు పాలగుదురు. కాబట్టి అట్టి తదుపరి అభిప్రాయము తీసుకొనబడినది. మేము అట్టి అంశముపై చట్టములోనికి వెళ్ళుట లేదు. అయిననూ , మేము ఈ సంగతిని రికార్డు చేసితిమి. పరిస్థితుల గొలుసులోని ఇతర లింకులను పరిగణించినపుడు కొంత సంబంధము లేక అన్వయము కలిగివుండవచ్చును.

17. చివర చూచిన థియరీని మేము ఇప్పుడు పరిశీలించెదము. ఉదయకాలమున అర్జునదాస్ (పిడబ్ల్యూ-7) పోలీస్ స్టేషన్ కు ఇచ్చిన సమాచారములో కౌశిక్ అప్పీలుదారునితోనూ, 'జువెనైల్ కె ' తో ఇంటి నుండి వెళ్ళినట్లుగా ప్రస్తావన లేదు.

అర్జున దాస్ (పిడబ్ల్యూ-7) , తన మేనల్లుడు కౌశిక్ సాయంత్రము మోటార్ బైక్ పై బయటికి వెళ్ళి తిరిగి రాలేదని మాత్రమే చెప్పెను. ట్రయల్ కోర్టులో ఇచ్చిన వాంగ్మూలములో కౌశిక్ అప్పీలుదారుతోనూ, 'జువెనైల్ కె ' తోనూ బయటికి వెళ్ళేనని వాంగ్మూలము ఇచ్చినప్పటికీ , సెక్షన్ 161 , సి ఆర్ పి సి కింద అతని వాంగ్మూలమును ప్రశ్నించగా మరియు పోలీస్ రికార్డులలో లిఖించబడిన దాని గూర్చి అడుగగా, దాని గూర్చి అతని వద్ద వివరణ లేదు.

18. చివరగా చూచిన పిడబ్ల్యూ-25 ముఖ్యమైన సాక్షి. ఆమె కౌశిక్ తల్లి. ఆమె తేదీ 19.06.2007 నాడు సుమారు 5 p.m . కు ఆఫీసు నుండి తిరిగి రాగా , కౌశిక్ అతని తండ్రి యొక్క మోటార్ బైక్ పై బయటకు వెళ్ళుట చూచెనని చెప్పెను. ఆమె అతనిని ప్రశ్నించగా, అతడు అప్పీలుదారుతోనూ మరియు 'జువెనైల్ కె ' తోనూ ఫాటిక్ రాయ్ వెళ్ళుచున్నట్లుగా తెల్పెను. ఆమె మరలా ఇట్లు తెలిపెను. ఆమె తన కుమారునితో గేటు వరకు వెళ్ళేనని, అక్కడ ఆమె అప్పీలుదారుడు , 'జువెనైల్ కె ' గేటు వద్ద నిలబడి వుండగా చూచెను. క్రాస్ ఎగ్జామినేషన్ లో సి ఆర్ పి సి లోని సెక్షన్ 161 క్రింద ఆమె వాంగ్మూలము గూర్చి ప్రశ్నించగా అటువంటిదేమీ లేదనీ, ఆమె ప్రకారము , ఆమె అప్పీలుదారుని , జువెనైల్ ను ఆమె గేటు వద్ద చూచినట్లుగా పరిశోధనాధికారికి తెలిపెనని చెప్పెను.

19. ప్రాసిక్యూషన్, సాక్షులు మాత్రమే కాకుండా , నిర్ధారణ అన్నది అదనపు న్యాయవిచారణలో అప్పీలుదారుమరియు 'జువెనైల్ కె ' యొక్క ఒప్పుకోలు పై నిర్ధారణ ఆధారపడినది. వారిరువురి ఒప్పుకోలు వాంగ్మూలములు అనగా , అప్పీలుదారుమరియు 'జువెనైల్ కె ' ప్రకారము వారిరువురూ ఫాటిక్రాయ్ బజార్ దగ్గర గల కల్వర్ట్ వద్ద ఎదురుచూచుచుండగా, 5-30 గంటలకు కౌశిక్ సర్కార్ అతని బైక్ పై వచ్చెననీ , అక్కడి నుండి వారు ముగ్గురూ బైక్ పై వెళ్ళిరని , అయితే, అతని తల్లి ఆఫీస్ నుండి ఇంటికి వచ్చిందా , లేదా అని తెలుసుకోడానికి సర్క్యూట్ హౌస్ దగ్గర కౌశిక్ బైక్ ఆపెననీ , వారిద్దరూ సర్క్యూట్

హౌస్ దగ్గర ఎదురు చూచిరనీ , ఇంటి సమాచారము తెలుసుకొన్న తర్వాత కౌశిక్ సర్కార్ సర్క్యూట్ హౌస్ వద్దకు రాగా , వారు కుమార్ ఘాట్ కు వెళ్ళిరని తెలిపిరి. ఒక వేళ అదనపు న్యాయ విచారణలోని ఒప్పుకోలు వాంగ్మూలమును చివరగా చూచిన థియరీలో , తల్లి (పిడబ్ల్యూ–25) ఇచ్చిన వాంగ్మూలమును నమ్ముట కష్టతరమగును. అయిననూ, అదనపు న్యాయ విచారణ ఒప్పుకోలు గూర్చి పట్టించుకోకపోయిననూ , పిడబ్ల్యూ–25 యొక్క వాంగ్మూలము చివరిగా చూచిన థియరీని అభివృద్ధి చేయుటకు ఒక విస్తరణగా తోచుచున్నది. ఇంత వరకూ , పోలీస్ స్టేషన్ లో రికార్డు చేయబడిన అర్జున్ దాస్ (పిడబ్ల్యూ–7) యొక్క టెలిఫోన్ కాల్ సి ఆర్ పి సి లోని సెక్షన్ 161 క్రింద గానీ , పిడబ్ల్యూ–7 మరియు పిడబ్ల్యూ–25 ఇచ్చిన వాంగ్మూలములు గానీ , కౌశిక్ సాయంత్రము అప్పీలుదారుమరియు జువెనైల్ ‘కె’ తో అతని ఇంటి నుండి బయటకు వెళ్ళినట్లు ప్రస్తావించలేదు. మరి ఇద్దరు సాక్షులను కూడా చివరగా చూచిన థియరీకి మద్దతుగా విచారించగా , అవి కూడా ఎలాంటి నమ్మకమును కలిగించలేదు.

20. స్వాధీనములుకు సంబంధించి , అది కూడా పరిస్థితుల గొలుసులో ఒక ముఖ్యమైన లింకు కాగా, ఆ స్వాధీనములు బయటి ప్రదేశము నుండి తీసుకొనిరి. ఒక బరువైన వస్తువును రక్తపు మరకలను గమనించిన ప్రదేశము నుండి మరియు ‘హోజాలి’ ని స్వాధీనము చేసుకొనుట, నది యొక్క గట్టు వరకు వెళ్ళి, నది ఒడ్డు నుండి ఈడ్చుకెళ్లిన గుర్తులు ఆగిపోయిన ప్రాంతము నుండి మోటార్ బైక్ ను స్వాధీనము చేసుకొనుట అనునది చాలా సహజమైనది మరియు ఎదురుచూచినదే, అప్పీలుదారునికి ప్రత్యేకముగా తెలుసునని ఇక్కడ అనలేము.

21. అదనపు న్యాయ విచారణ ఒప్పుకోలు ఒక బలహీనమైన ఎవిడెన్స్. మరి ప్రత్యేకముగా అది ట్రయల్ జరుగు సమయములో వెనుకకు తీసుకొనబడినది. దానిని స్థిరపరచుటకు బలమైన సాక్ష్యము వుండి తీరాలి. మరియు అట్టి ఒప్పుకోలు పూర్తిగా స్వంతమని, నిజమైనదని

రూఢి పరచవలెను. పైన తెలిపిన చర్చ రీత్యా , అదనపు న్యాయ విచారణ ఒప్పుకోలును సమర్ధించుటకు ఎటువంటి బలమైన సాక్ష్యమును మేము కనుగొనలేదు. పైగా , ప్రాసిక్యూషన్ వారి ఎవిడెన్స్ కు అది అనుగుణముగా లేదు.

22. పైన జరిపిన చర్చ రీత్యా , పరిస్థితుల గొలుసులోని ఎక్కువ లింకులు గూర్చి ప్రాసిక్యూషన్ ఎవిడెన్స్ రుజువు చేయలేకపోయెను. అందువలన అప్పీలుదారుని శిక్షను నిర్ధారణ చేయుటను ఆమోదించుట అన్యాయమగును. అప్పీలుదారుసందేహసహిత ప్రయోజనమును (బెనిఫిట్ ఆఫ్ డౌట్ ) పొందుటకు అర్హుడు. ఆ విధముగా , అప్పీలు ఆమోదించబడెను. మరియు అప్పీలుదారుఅన్ని ఆరోపణల నుండి విడుదల పొందెను. అప్పీలుదారుఅన్ని ఆరోపణల నుండి విడుదల పొందెను. అప్పీలుదారుకోర్టు వారి ఆధీనములోనున్నాడు. అయిననూ , రాష్ట్ర ప్రభుత్వము అతనికి తాత్కాలిక విముక్తికి (పెరోల్ )ను అనుమతించెను. అతను తక్షణమే విడుదల కాబడును.

23. ఏమైనా ఇతరత్రా అప్లికేషన్లు వున్నచో, అవి కూడా పరిష్కరింపబడెను.

**న్యాయమూర్తి.**

**బి.ఆర్. గవాయ్**

**న్యాయమూర్తి.**

**విక్రమ్ నాథ్**

**న్యూఢిల్లీ**
28.02.2023.